# విడని ముడి

ఎన్నాళ్ల ఎడబాటని కాదు
ఎంత వయసొచ్చిందనీ కాదు
ఎన్ని మార్లు ఎగిరొచ్చినా
వెన్నంటి వదలని వాసనలు
అంతటా అలుముకుంటున్నప్పుడు
జీవితం నాలుగు గోడలనుండి దూకి
ఎంతగా పారి పోవాలనుకున్నా
ఎన్ని మార్లు ద్వారం దగ్గరే ఆగిపోలేదు
ఎన్నెన్ని మార్లు అవకాశాలు చేజారి పోలేదు.

అందుకేనేమో?
నిర్ధారణగా తెలిసినా
నిప్పులు చెరిగే ఎండలో నీడకోసం పరిగెడుతున్నట్టు
ఎండిపోతున్న గొంతు తడికోసం తపిస్తున్నట్టు
ఉరుకులు పరుగులు.

తీసుకెళ్తున్న పెట్టెల నిండా
పాత జ్ఞాపకాల దొంతర్లు.
అనురాగ బంధాల రక్త స్పర్శానుభూతులు
నిత్యజీవితంలో నిమిత్తమాత్రంగానే ఉంటున్నా
కాలుమోపిన దగ్గర్నుంచి కదిలి వచ్చే వరకూ
ఏ క్షణం వృధాపోదు.

పొట్టకోసం చెదిరిపోయిన పిట్టలన్నీ
కాకతాళీయంగా కలుసుకున్న అద్భుతం.
కాస్తంత ముందూ వెనకల మూలంగా

కలుసుకోలేక పోయిన చింత
ఆప్యాయంగా నిమిరే గాలి – సేదతీర్చే నీరు
కాస్సేపు కళ్లు చెమర్చినా
సమాధులనుండి తాత ముత్తాతల స్మృతులు
ఎంత మారినా అక్కడి అణువణువు
శత సహస్రాబ్దాల నుండే తెలిసినట్టున్న అనుభవం
ప్రేమంతా నింపి ఒంపిన పలకరింపులు, పులకరింపులు
ఏవీ అక్కడ నుండి కదలనీయవు

ఎన్నాళ్లున్నా
మళ్లీ ఎప్పుడోనన్న దిగులు
మనస్సులో దృశ్యం మారే వరకూ
తిరుగు ప్రయాణంలో
తానే పడవయి తీసుకువెళ్తుంది.